నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | 23 ఆగస్టు, 2024 | www.navatelangana.com

ఎంజేపీని తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని అనుకుంటలో గల మహాత్మా జ్యోతి భా పూలే బీసీ గురుకుల పాఠశాల కలెక్టర్ కలెక్టర్ రాజర్ష షా తనిఖీ చేశారు. మధ్యహ్నాం భోజనం, స్టార్ రూమ్, సిక్ రూమ్, డ్రైనేజీ తదితర వాటిని పరిశీలించి సూచనలు చేశారు. మధ్యాహ్నాం భోజనం పరిశీలించి మెనూ ప్రకారం గురువారం చికెన్ ఉండడంతో ఎన్ని కేజీల చికెన్ తెచ్చారరు, ఎంత మంది విద్యార్థులకు వంట చేశారని ప్రిన్సిపల్ ఉమాదేవిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆయా శాఖ అధికారులు, ఉపాధ్యాయులున్నారు.

మొక్కలు నాటిన జడ్పీ సీఈఓ

నవతెలంగాణ-నేరడిగొండ



మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి గురువారం అమ్మ పేరు మీద మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రవీందర్, ఎంపీడీఓ రాజ్‌వీర్, ఎంపీఓ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'గూడు' గోడు తీరేదెప్పుడు..?

- ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుపై గంపెడాశలు
- సర్కారు హామీపై అనేక మంది లబ్ధిదారుల ఆసక్తి
- ప్రభుత్వ ప్రకటన కోసం ఆతృతగా ఎదురుచూపులు
- ఉమ్మడి జిల్లాలో 7,57,807మంది దరఖాస్తులు



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. ఇప్పటికే పలు గ్యారెంటీలు అమలవుతుండగా.. మిగితా వాటిపైనా ఆసక్తి నెలకొంది. ఇందులో ఇందిరమ్మ ఇండ్ల పథకమే చాలా కీలకమైంది. సొంత గూడు కోసం ఏండ్లుగా అనేక మంది పేదలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. అతి త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తామని డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు సైతం భరోసా ఇచ్చారు. దీంతో అనేక ఏండ్లుగా ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. ఆగస్టు నెలలోనే ప్రారంభిస్తామని చెప్పినప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యమైనట్లు తెలుస్తోంది. దీంతో అనేక మంది పేదలు ప్రభుత్వ ప్రకటన కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు అందించిన లబ్ధిదారులు సర్కారు ఆదేశాల కోసం వేచిచూస్తున్నారు. అతి ముఖ్యమైన ఈ పథకంపై ప్రభుత్వం త్వరగా ప్రకటన చేయాలని కోరుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేదోళ్ల జీవితంలో కూడుతో పాటు గూడు కూడా చాలా కీలకమైంది. చిన్న ఇల్లు అయినా సొంతది ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ అనేక మంది పేదలకు సొంత గూడు లేకపోవడంతో ఇప్పటికీ పూరిగుడిసెల్లోనే జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78ఏండ్లు గడుస్తున్నా ఇప్పటికీ అనేక మంది పేదలు తలదాచుకోవడానికి సొంత ఇల్లు లేకుండా పోయింది. ప్రభుత్వాల నిర్లక్ష్యం..పాలకుల పట్టింపు లేని తన కారణంగా అనేక మంది పేదల జీవితాలు గుడిసెల్లోనే మగ్గిపోతున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ రెండు పడక గదులు మంజూరుచేస్తామని చెప్పింది. గత ఎన్నికల సందర్భంగానూ హామీనిచ్చినప్పటికీ నెరవేరలేదు. కొన్ని చోట్ల రూ.కోట్లు ఖర్చు చేసి డబుల్‌బెడ్ రూంలు నిర్మించినా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. దీంతో అనేక చోట్ల అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. వాటిని పంపిణీ చేయడంపై తాజా ప్రభుత్వం సైతం దృష్టిసారించడం లేదనే అపవాదు ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అధికారంలోకి వస్తే రూ.ఎస్సీ,ఎస్టీలకు రూ.6లక్షలు, మిగితా లబ్ధిదారులకు రూ.5లక్షల చొప్పున ఇందిరమ్మ ఇండ్లకు మంజూరుచేస్తామని హామీనివ్వడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమైంది. ఇటీవల జిల్లాకు వచ్చిన డిప్యూటీ సీఎం సైతం ఇదే విషయాన్ని మరోసారి ప్రస్తావించి అర్హులైన లబ్ధిదారుల్లో ఆశలు నింపారు.

రూ.లక్షల్లో లబ్ధిదారులు..!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇండ్లను మంజూరు చేయకపోవడంతో అనేక మంది లబ్ధిదారులు సొంత ఇంటికి దూరమయ్యారు. ప్రస్తుతం వారంతా సొంత ఇంటి నిర్మాణం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ప్రజాపాలన పేరిట లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంది. వీటి కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7,57,807మంది దరఖాస్తులు చేశారు. వీటితో పాటు సొంత స్థలం లేని పేదలకు 250గజాల చొప్పున స్థలాలు కూడా అందజేస్తామని హామీనివ్వడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1151మంది దరఖాస్తులు అందించారు. కానీ ప్రభుత్వం మాత్రం తొలి విడతలో నియోజకవర్గానికి 3500చొప్పున మంజూరుచేస్తామని ప్రకటించింది. దీంతో ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో తొలి విడతలో 35వేల ఇండ్లు మంజూరుకానున్నాయి. కానీ ఒక్కో జిల్లా నుంచి ఇండ్ల కోసం దరఖాస్తులు చేసిన వారు మాత్రం లక్షల్లో ఉన్నారు. ఎందుకంటే గత పదేండ్లుగా ఇండ్లు మంజూరుకాకపోవడం.. అనేక జంటలు ఉమ్మడి కుటుంబాల నుంచి విడిపోయి వేరుగా జీవిస్తున్నారు. వారికి ఇండ్లు లేకపోవడంతో ప్రభుత్వం మీదనే ఆశతో ఉన్నారు. ఇలాంటి వారందరూ ఇండ్ల కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వీటిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఇండ్లు, స్థలాల కోసం దరఖాస్తులు చేసిన లబ్ధిదారులు

జిల్లా	ఇండ్ల కోసం	స్థలాల కోసం
ఆదిలాబాద్	199803	335
నిర్మల్	193647	349
ఆసిఫాబాద్	154141	144
మంచిర్యాల	210216	323

మహిళా కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ రంగ స్కీముల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ డైలీ వేజ్ టైం స్కెల్ పనిచేస్తున్న మహిళ కార్మిక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సీఐటీయూ అఖిల భారత అధ్యక్షులు డా.హేమలత ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన వర్క్ షాప్‌కు జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. జిల్లా, పట్టణ, మండల కేంద్రాలలో ప్రయివేటు షాపింగ్ మాల్స్ సూపర్ మార్కెట్స్ పాఠశాలలు కళాశాలల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, సౌకర్యాలు కల్పించడం లేదని పనిప్రాంతాల్లో మౌళిక సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పని వేళల కనీసం కూర్చోవడానికి కుర్చీలను ఏర్పాటు చేయడం లేదని అన్నారు. మహిళా కార్మిక ఉద్యోగుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, నాయకులు పాల్గొన్నారు.

కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవం

- విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ (రసాయన), ఫిజిక్స్(భౌతిక), ఎన్‌సీసీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పెయింటింగ్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.సంగీత మాట్లాడుతూ భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో, అంతరిక్ష రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని తెలిపారు. విద్యార్థులు పరిశోధనా రంగం వైపు ఆసక్తిని పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగ్రామ్ అంతర్వేది, అరుణ్ కుమార్, రమాకాంత్ గౌడ్, మంజుల, శ్రావణి, జోత్స్న, రవి కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని జీసీడీఓ ఛాయా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం, ముందులు తదితర వాటి గురించి పాఠశాల ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు. వంట గది వంట సరుకులు, పండ్లను చూశారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం రుచికరమైన వేడివేడి భోజనం అందించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త వహించాలని సూచించారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్, వార్డెన్ వనిత, పీడీ విశ్వనాథ్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

నూతన ఏఈఓకు సన్మానం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని పల్సి గ్రామంలో గురువారం వ్యవసాయ విస్తీర్ణ అధికారిగా యోగేష్ బాధ్యతలు చేపట్టడంతో వారికి గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ హనుమల్లు సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులకు అందుబాటులో ఉండి వారికి ఎల్లవేళలా పంటలకు అవసరమైన సూచనలు సలహాల అందించేలా కృషి చేయాలన్నారు. దీంతో పాటు రుణమాఫీకి సంబంధించిన రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కానీ రైతుల వద్ద నుంచి పాత్రలు సేకరించి వారికి త్వరలోనే ప్రభుత్వం అందించే రుణమాఫీ అందేలా చూడలని తెలపరు. అనంతరం ఇటీవల పల్సి తండా గ్రామ పంచాయతీకి సంబంధించిన కార్యదర్శి బదిలీపై వెళ్లడంతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నారాయణ, లక్ష్మణ్, సురేష్, విలాస్ పటేల్, గంగన్న, మోహన్, నరేందర్ పాల్గొన్నారు.

పోడు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంకరాఘవులు
- రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గిరిజన గ్రామాల్లో పోడు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలివ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంకరాఘవులు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సాగు చేసుకుంటున్న రైతులందరిని గుర్తించి పోడు పట్టాలివ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లంకరాఘవులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ, రెవిన్యూ శాఖ, అటవీ అధికారులు ఉమ్మడిగా సర్వే నిర్వహించి, సెక్షన్ 4 భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. తప్పులు దొర్లిన పోడు హక్కు పత్రలలోని లోపాల సవరణకు భూములు రీ సర్వే చేయాలన్నారు. హక్కు పత్రాలు ఇవ్వని పోడు భూములకు కొత్త హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. రెవెన్యూ భూములు సాగు చేస్తున్న రైతులకు పహానీలు మంజూరు చేసి, రుణాలు అందిచాలని, గిరిజనులైతే వారికి లావణి పట్టాలు మంజూరు చేయాలన్నారు. అవసరమైన రైతులకు వెంటనే విరాసత్‌లు చేయాలని, గిరిజన రైతులకు ఉచితంగా విరాసత్ చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజన భూములకు బోర్లు, కరెంటు మంజూరు చేసి వారి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదని అవసరమైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. ముఖ్యంగా పీవీటీజీ కోలాంలకు అంత్యోదయ రేషన్ కార్డులు మజూరు చేయాలన్నారు. వ్యవసాయంపై ఆధారపడిన భూములు లేని పేదలకు వ్యవసాయ భూములు పంపిణీ చేయాలని, ప్రభుత్వ హామీ ప్రకారం రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతులందరి రుణాలు మాపీ చేయాలన్నారు. సాగు చేస్తున్న సీలింగ్, జమీందారు భూములకు వెంటనే పట్టాలివ్వాలని, మండల కేంద్రానికి 5 కిమీ పరిధిలో ఉన్న పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వరాధనే నిబంధనలను రద్దు చేయాలన్నారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో పోడు సాగు చేసుకుంటున్న రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సాగు చేసుకుంటున్న వారికి పోటు పట్టాలు లేని కారణంగా రుణాలు రావడం లేదన్నారు. గతంలో రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం రైతులకు పోడు పట్టాలివ్వడంతో అర్హులైన వారందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి పూసం సచిన్, రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, టీఏజీఎస్ జిల్లా నాయకులు, తోడసం భీంరావ్, స్వామి, ఉయిక విష్ణు, ఆత్రం కిష్టన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్ స్వామి,ఆశన్న, డి.స్వామి ఉన్నారు.

రుణమాఫీ పేరుతో రైతులకు మోసం

నవతెలంగాణ-కుభీర్

రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కిరణ్ కొమ్రేవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు. అదేవిధంగా పార్డి(బి)లో నిర్వహించిన ధర్నాలో బీజేపీ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి కొందరికి మాత్రమే చేస్తోందని అన్నారు. దీంతో రైతులందరితో కలిసి పార్డి(బి) బైంసా రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో వాహనాలకు కొద్ది సేపు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కానోబా, సీనియర్ నాయకులు శివలింగం, శ్రీకాంత్ మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా, రైతులను మోసం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహినోద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎన్నిల అనిల్, పీఏసీఎస్ చైర్మెన్ రేకుల గంగాచరణ్, బీజేపీ నాయకులు వి శ్రీకాంత్, లింగంపెల్లి శివలింగం, పోతన్న, మడి ప్రవీణ్, గోవర్ధన్, సంతోష్, శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

ఎంజేపీ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావలలోని గల మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం. కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ మావలలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ, ప్రశ్నించిన విద్యార్థులకు టీసీలు ఇస్తామంటూ బెదిరిస్తున్నారని ఆరోపించారు. వ్యక్తిగత మానసిక రుగ్మత గురి చేస్తూ, సరైన భోజనం ఎలాంటి వసతులు కల్పించడంలో విఫలమైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడాం విజయ్ కుమార్, గణేష్, హుస్సేన్ ఉన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న ఎంజేపీ ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావల మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాల జైనథ్ ప్రిన్సిపల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో నిఖిల్ నాయకులు ఉన్నారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పశు గణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా పశువైద్యాధికారి సురేష్‌లతో కలిసి 21వ అఖిల భారత పశుగణనలో భాగంగా పశువులకు అందించే వైద్య సేవలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పశు గణను కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుండి డిసెంబర్ 31వ తేదీలోగా పశుగణన కార్యక్రమాన్ని పూర్తిచేసే విధంగా కార్యచరణ రూపొందించాలని, ఈ క్రమంలో సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించాలన్నారు. పశు వైద్యాధికారులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉంటూ వారికి నిర్దేశించిన వ్యాక్సినేషన్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన చోట క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకొని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ప్రోత్సహించే విధంగా డైరీ ఫార్మ్ ఏర్పాటుకు గేదెల కొనుగోలులో సహకరించాలని, జిల్లాలో పాల ఉత్పత్తికి సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం అఖిల భారత పశు గణన కార్యక్రమ సంబంధిత గోడ ప్రజలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశుగణన నోడల్ అధికారి విజయకుమార్, మండల పశువైద్యాధికారి మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్

నవతెలంగాణ-కౌటాల



బదిలీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందు రావు అన్నారు. గురువారం సభ్యత్వ కాంపెయిన్‌లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం జరిగిందని, పలువురు ఉపాధ్యాయులు సంఘ సభ్యత్వం ఇస్తూ తమ సమస్యలను కూడా సంఘం దృష్టికి తీసుకు వచ్చారన్నారు. జీఓ 317 ద్వారా స్థానికత కోల్పోయి దూర ప్రాంతం నుంచి ఇక్కడికి కేటాయించబడి విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు ఈ బదిలీలు కొంత ఊరాటం కలిగిస్తాయని అన్నారు. ప్రభుత్వం బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేస్తూ ఆ స్థానాలలో అకాడమిక్ తాత్కాలిక విద్య బోధకులను నియమించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీలకు షెడ్యూల్ ఇచ్చినందున అవకాశం ఉన్న ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులు నిబంధనల ప్రకారం సాధారణ సెలవులు వినియోగించే విషయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇతర పాఠశాలల నుండి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో అక్కడ కూడా విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలకు విద్య వాలంటీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు సుల్వ ప్రశాంత్, భగవాన్, సఫల్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆదిత్య ఎల్-1 రాకెట్ ప్రదర్శన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని గౌరాపూర్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని సాంఘిక శాస్త్రం భోదిస్తున్న తొడసం కైలాస్ తన సొంత ఖర్చులతో ఆన్‌లైన్ ద్వారా తెప్పించిన రాకెట్, మోడల్ వ్యోమోగాములను పాఠశాలలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా పీఎస్ఎల్‌వీ రాకెట్ లాంచింగ్ ప్యాడ్ నుంచి అంతరిక్షంలో ఎలా వెళుతుందనేదాన్ని లైవ్‌గా చూపించారు. పిల్లలు నిజంగా ఇస్రోకు వెళ్లి చూసినట్లుగా అనుభూతి పొందారు. పిల్లలు ఎంతో ఆసక్తితో గమనించారు. భారత ఇస్రో ప్రయాణం గురించి ఫోటో ఎగ్జిబిషన్ పిల్లలను చాలా ఆకట్టుకుందన్నారు. ఆ తరువాత పాఠశాలలో తొడసం కైలాస్ తన సొంత ప్రొజెక్టర్ ల్యాప్‌టాప్‌తో ఇస్రో సాధించిన విజయాల గురించి, అంతరిక్షం గురించి, పవర్ పాయింట్ ప్రదర్శన చేశారు. తరువాత భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇస్రో చైర్మెన్ సోమ్‌నాథ్ ప్రేరణాత్మకమైనా సందేశాలని వినిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు దశరథ్ సురాజ్, కైలేశ్వరి, రాజ్ మోహన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.



అమ్మ పేరుతో మొక్క నాటాలి

నవతెలంగాణ-ఉట్నూర్



అమ్మ పేరుతో మొక్కను నాటాలని మాజీ సర్పంచ్ జాదవ్ హరి నాయక్ అన్నారు. గురువారం మండలంలోని లింగోజితండ గ్రామపంచాయతీ పరిధిలోని లాల్‌టెక్డి జూనియర్ కళాశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమ్మ పేరుతో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, టీప లత, ఎఫ్‌ప రామారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

అన్నాబావు సాఠే అడుగుజాడల్లో నడవాలి

నవతెలంగాణ-నార్నూర్



అన్నాభావు సాఠే అడుగుజాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ మెంబర్, జిల్లా నాయకులు మోటేరావ్ అనిల్, కోటంబే సిద్ధార్థ్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని మెడిగూడ గ్రామంలో నిర్వహించిన అన్నాబావు సాఠే జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా దళిత నాయకులతో గ్రామస్తులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. సమాజం కోసం మేధావి అన్నాభావు సాఠే చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు వాగ్మారే విలాస్, మాజీ సర్పంచ్ కొడప ఆనంద్ రావ్, మోరే కిషన్, వాగ్మారే బలరాం, బాన్సుడే యశ్వంత్, యు.యశ్వంత్, సర్వదే ఆకాశ్, జీవారే సంతోష్, వాగ్మారే సురేష్, గాయక్‌వాడ్ తాతేరావ్, బన్సరే అమృత్, కే రాము, ఎస్ సిద్ధార్థ్ ఉన్నారు.

బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉద్యమిస్తుంది

- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేసేంత వరకు బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉద్యమిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దేవుళ్లపై ప్రమాణం చేసిన సీఎం రేవంత్ రెడ్డి రైతుకు రుణమాఫీ చేయకుండా, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర స్థాయిలో బ్యాంకర్లతో మీటింగ్ జరిగిన సమయంలో రూ.41వేల కోట్లు రుణమాఫీకి అవసరమని నిర్ణయించారు. కెబినెట్లో రూ.31 వేలు, బడ్జెట్‌లో పెట్టింది రూ.26 వేల కోట్లని తెలిపారు. బ్యాంకర్ల మీటింగ్‌లో రూ.41వేల కోట్లు నిర్ణయించి, బడ్జెట్‌లోకి వచ్చే సరికి రూ.26 కోట్లు అయిందని ఎద్దేవ చేశారు. బీఆర్ఎస్ ఉనికి కోసం రైతులను రెచ్చగొట్టుతుందని కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రుణమాఫీ విషయంలో అయోమంలో పడేసింది కాంగ్రెస్ కాదాని ప్రశ్నించారు. హక్కులు, హామీలను అడిగినందుకు రైతులపై కేసులు పెట్టారని, ఎన్ని కేసులు పెట్టిన బయపడేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రోకండ్ల రమేష్, యూనిస్ అక్బానీ, పరమేశ్వర్, గండ్రత్ రమేష్, రాజు, మెట్టు ప్రహ్లాద్, ఆజయ్, ప్రకాష్, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

నార్నూర్ : రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తోందని, జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.2లక్షలు రుణమాఫీ పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలన్నారు. కొందరికి వేసి ఇంకొందరికి వేయకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హనుమంత్ రావ్, మాజీ సర్పంచుల మండలాధ్యక్షుడు యుర్వేత రూపదేవ్, నాయకులు సయ్యద్ ఖాసీం, ఫెరోజ్, రమేష్, రూపదేవ్, రాథోడ్ విష్ణు, రాథోడ్ రామేశ్వర్, అన్నాభావు సాఠే జిల్లా నాయకులు ఉద్ధవ్, రాథోడ్ సుభాష్, శివాజీ, జితేందర్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల రైతులు ఉన్నారు.

ఉట్నూర్ : రుణమాఫీ పేరుతో మాయమాటలు చెప్పి కాంగ్రెస్ నాయకులు ఓట్లు దండుకున్నారని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులకు రైతుబంధు ఇవ్వడంతో పాటు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు భరత్ చౌహన్, కార్యకర్తలు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్

ఇచ్చోడ : రైతులకు ఎలాంటి షరతులు లేకుండా, రుణమాఫీ చేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ అమాయక రైతుల మీద కేసులు పెట్టడం సరికాదన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుల మీద చిత్తశుద్ధి ఉంటే రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా సంపూర్ణ రుణమాఫి చేసి రైతులతో పాలాభిషేకం చేసుకోవాలన్నారు. పాస్ బుక్ ప్రామాణికంగా రుణ మాఫీ చేయాలి. కానీ కుటుంబానికి రూ.2 లక్షలు అని చెప్పి, ఇంకా లక్ష ఇరవై వేలు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ చేయకుండా రైతులకు మోసం చేశారని అన్నారు. అదేవిధంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై ప్రభుత్వం కేసులు పెట్టడం సరికాదన్నారు. రైతులపై పెట్టిన కేసులు ఉపసంహరించుకోవాలని అన్నారు. ఆగస్టు15లోగా రైతులందరికి రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహాస్వామి మీద ఒట్టు పెట్టి, మాట తప్పారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు ముండే పాండు రంగ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గాడ్గే సుభాష్, వెంకటేష్, గణేష్, బోథ్ నియోజకవర్గంలో రైతులు, రైతు నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నార్నూర్



ఉట్నూర్



ఇచ్చోడ

గూడ్స్ రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



గూడ్స్ రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రుయ్యాడి గ్రామానికి చెందిన మావురపు వెంకటేష్ (31) కోసాయి రైల్వే స్టేషన్‌లో గురువారం గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు వెంకటేష్ గత కొద్ది నెలల నుంచి తాగుడుకు బానిసై మద్యం మత్తులో మహారాష్ట్ర కిన్వట్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీస్ భోజన్న తెలిపారు.

క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఒలంపిక్ అసోయేషన్ అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఖేలో ఇండియా హాకీ సెంటర్‌లో క్రీడాకారులకు యునిఫాంలను అందించారు. ఈ సందర్భంగా బీజీఆర్ మాట్లాడుతూ ఖేలో ఇండియాలో హాకీ క్రీడాకారులకు వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలన్నారు. కోచ్‌ల సూచనలు పాటిస్తు శ్రమిస్తు ట్రోఫీలే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎలాంటి అవసరం ఉన్న తన వంతుగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్ధసారథి, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగస్తులపై ఆరోపణలు మానుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో విధులు నిర్వహిస్తున్న మాదిగ జాతి ఉద్యోగస్తులను మానసిక వేధింపులకు గురి చేయడం జరుగుతుందని ఇలాంటివి మానుకోవాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ మావలలోని ఏంజేపీ ప్రిన్సిపల్‌పై అకారణంగా ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థులను వేధింపులకు గురి చేస్తుందని, ఏబీవీపీ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇకమీదట మాదిగ జాతి ఉద్యోగస్తులను బ్లాక్ మెయిలింగ్ చేయడం మానుకోవాలని లేనిపక్షంలో మాదిగ సంఘాల తరపున తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని. హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు కత్తి గంగాధర్, జిల్లా కార్యదర్శి, జిల్లా సహాయ కార్యదర్శి కొల్లూరు స్వామి, నాయకులు భూమన్న, జామ్లే నాందేవ్ పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రిలో

ధరల పట్టిక ప్రదర్శించాలి



- ఆస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రుల నిర్వాహకులు ధరల పట్టికను ప్రదర్శించడంతో పాటు రోగులకు నాణ్యమైన వైద్యమందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. గురువారం పట్టణంలోని గజానంద్ ప్రయివేటు ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ, ఐసీయూతో పాటు మెడికల్ షాపులో ఉన్న రిజిస్టర్లలను పరిశీలించారు. అదే విధంగా మందులను చూసి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో చేరిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యం, ధరలు తదితర వాటి గురించి తెలుసుకున్నారు. కొన్ని లోటు పాట్లు ఉండటంతో నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో వాటిని సరి చేయాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధుల కాలమని, ప్రభుత్వ ఆస్పత్రితో పాటు ప్రయివేట్ లోను చాలా మంది రోగులు వస్తుంటారన్నారు. ఈ క్రమంలో ధరలపైన ఐఎంఏ ద్వారా ఓరియేంటేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు ఏ ప్రయివేట్ ఆస్పత్రిలో లేదని, కేవలం రిమ్స్‌లో ఉందన్నారు. గజానంద్ ఆస్పత్రి సందర్శనలో కొన్ని లోపాలను గుర్తించామని, వాటిని సరి చేసుకొవాలని నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. వారం రోజుల్లో మళ్లీ విజిట్ ఉంటుందని అప్పటికి మార్పు రాకపోతే కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ కృష్ణ, డీఎంఓ శ్రీధర్, వైద్యులున్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి



నవతెలంగాణ-తలమడుగు

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా మొక్కలు నాటాలని ప్రజలను కోరారు. రోజురోజుకు అంతరించిపోతున్న వివిధ రకాల మొక్కలతో పాటు వృక్షా జాతులు కూడా నశించి పోవడంతో, బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటినట్లయితే రాబోయే తరానికి మంచి గాలిని అందించిన వారమవుతామన్నారు. రోజురోజుకు పర్యావరణంలో అనేక మార్పులు రావడంతో స్వచ్ఛమైన గాలి కూడా దొరకడం లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, ఉపాధ్యాయులు వినోద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గజానన్, అంగన్‌వాడీ టీచర్ మంజుల, రమణ, పద్మ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలి



నవతెలంగాణ-నార్నూర్

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో ప్రజలు పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీఓ స్వప్న శీల సూచించారు. గురువారం మండల కేంద్రంతో పాటు మాన్కాపూర్, రాజులగూడ తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. వార్డుల్లో తిరుగుతూ పారిశుధ్య కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో మురుగు కాలువలో నీటి నిల్వ ఉండకుండా చూడాలని చెత్త చెదారం డంపింగ్ యార్డులో వేసేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలోని 23 గ్రామపంచాయతీలలో సానిటేషన్ కొరకు సరిపడ బ్లీచింగ్ పౌడర్ అందుబాటులో ఉందని దోమలను నివారించడానికి లిమ్ బ్యాగ్ బయో లార్వాను తెప్పించామని కొరత లేదని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పీహెచ్‌సీ డాక్టర్ రాంబాబు వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటా ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. పరిసరాలను పరిశీలించి డ్రమ్‌లో కుళాయిలో ఉన్న నిల్వ నీటిని పారబోయించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వారి వెంట వైద్య సిబ్బంది సతవ్వ, షీలా, అంగన్‌వాడీలు, ఆశాలు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి, ఏఈఓలకు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఖోడద్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేసి, బదిలీపై వెలుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శి వాణి, ఏఈఓ సౌజన్యను గురువారం గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, కోఆప్షన్ సభ్యులు బాబుఖాన్, గ్రామపెద్ద చిలుకూరి లక్ష్మారెడ్డి, గ్రామస్తులు నారాయణరెడ్డి, సుదర్శన్, వెంకట్‌రెడ్డి గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా మెగాస్టార్ పుట్టిన రోజు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అంజనీ పుత్ర సేవ సమితి ఆధ్వర్యంలో ఫ్యాన్స్ వేడుకలు జరుపుకున్నారు. గురువారం పట్టణంలోని నటరాజ్ థియేటర్‌లో కేక్ కటింగ్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిమ్స్‌లో గల సత్య సాయి ట్రస్ట్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ జిల్లా అధ్యక్షులు అనిల్, అభిమానులు శ్రీనివాస్, కార్తీక్, వివేక్, సందీప్, వినయ్, సంతోష్, రవితేజ పాల్గొన్నారు.

3
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | 23 ఆగస్టు, 2024 | www.navatelangana.com

చొప్పన్‌గూడ పాఠశాలలో వైద్యశిబిరం
నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని చొప్పన్‌గూడ పాఠశాలలో గురువారం వైద్యశిబిరం నిర్వహించి 62 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి విద్యార్థి నుండి రక్త నమూనాలు సేకరించి మందులు పంపిణీ చేశారు. అనంతరం చుట్టుప్రక్కల పరిసర ప్రాంతాలు, వ్యక్తిగత పరిశుభ్రత, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. దోమలు అభివృద్ధి చెందకుండా పాటించాల్సిన జాగ్రత్తల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గోదావరి, ఆశావర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి
నవతెలంగాణ-సిర్పూర్(టి)



రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ఆరోగ్య అత్యవసర సేవ కోసం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లు త్వరగా స్పందించి సేవలందించాలని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సామ్రాట్ అన్నారు. బుధవారం రాత్రి 108,102, అంబులెన్సు సేవలను వినియోగించుకోవాలని, ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, రికార్డులను పరిశీలిస్తూ, కేసుల గురించి ఆరాతిస్తూ గర్భిణులకు నెలలు నిండిన నుండి డెలివరీ అయ్యే వరకు 102 వాహనాన్ని వినియోగించుకోవాలని సిర్పూర్ ఆస్పత్రి సిబ్బంది, అంబులెన్స్ సిబ్బందికి తెలిపారు. అదేవిధంగా ఇప్పటి వరకు రాత్రి పగలు సేవలు అందిస్తున్న సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఈఈఎంఐ సతీష్, ఎఫ్‌ఎం తాజ్, అంబులెన్స్ సిబ్బంది సుభాష్, అజయ్, శ్రవణ్, ప్రవీణ్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై విచారణ జరపాలి
- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎల్‌ఆర్‌ఎస్-2020 పథకంలో వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరపాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం కమిటీ సభ్యులు, ఎంపీడీఓలు, మండల పంచాయతీ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను లేఅవుట్ అనుమతులు లేని వాటిపై క్షేత్రస్థాయిలో ప్రత్యేక విచారణ జరపాలన్నారు. పంచాయితీ కార్యదర్శి, ఆర్ఐ, ఇరిగేషన్ అధికారులతో బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ముఖ్యంగా ప్రభుత్వ, నీటిపారుదల శాఖ సంబంధిత భూములు, నాలా భూములు కొనుగోలు చేసిన వాటి రికార్డులను స్పష్టంగా పరిశీలించడంతో పాటు ఇండ్ల స్థలాల పత్రాలు పరిశీలించాలని సూచించారు. ఈ క్రమంలో సంబంధిత దరఖాస్తుదారుడికి ముందస్తు సమాచారం అందించాలన్నారు. విచారణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, పట్టణ ప్రణాళిక అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

నేడు అరెస్టులను నిరసిస్తూ ఆందోళనలు
నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ధర్నాలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వెళ్తున్న కార్మిక నాయకుల అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ 23న మండల కేంద్రాల్లోనూ ఆందోళనలు చేపడుతున్నట్టు మధ్యాహ్న భోజనం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణమాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నిర్వహణను స్వచ్ఛంద సేవా సంస్థ హరే రామ హరే కృష్ణ అనే సంస్థకు అప్పగించొద్దని, పెండింగ్లో ఉన్న అల్పాహారం బిల్లులు గౌరవ వేతనం, గుడ్ల బిల్లులు చెల్లించాలని, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రకటించిన వేతనం రూ.పదివేలు వెంటనే ఇవ్వాలన్నారు.

రోడ్డుపై గుంతను పూడ్చిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని కల్వాడా, కొంచెవెల్లి ప్రధాన రహదారిపై కల్వాడా వద్ద పెద్ద గుంత ఏర్పడడంతో స్థానిక కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు హట్కర్ మధుకర్, జేసీబీ సహాయంతో మట్టిని నింపి గుంతను పూడ్చారు. గుంతను పూడ్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి మదూకర్‌ను అభినందించారు.

బెంగాళీల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలో నివాసముంటున్న బెంగాళీల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మంత్రి శాంతన్ ఠాకూర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బెంగాళీల సమస్యలను ఆయనకు వివరించారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో శాంతన్ ఠాకూర్ బెంగాలీ క్యాంప్‌లకు ఎన్నికల ప్రచారానికి రాగా ఆయనకు బెంగాళీలు బ్రహ్మరథం పట్టిన విషయం తెల్సిందే. బెంగాళీల సమస్యల పట్ల కేంద్ర మంత్రికి అవగాహన ఉండడంతో తాను ఆయనను కలిసి సమస్యలు వివరించినట్లు ఎమ్మెల్యే హరీష్‌బాబు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఎన్నిక



నవతెలంగాణ-దహెగాం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మదును శ్రీ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, గౌరవ అధ్యక్షులుగా రిజ్వానా రజ్వి, సహాయ కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా శేఖర్, రవి, రాధిక, అధికార ప్రతినిధిగా లక్ష్మణ్, మీడియా ప్రతినిధులుగా అశోక్, లలిత, సలహాదారులుగా స్వప్న, సంతోష్ కుమార్, శేఖర్, లక్ష్మీతో పాటు మరో 17 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అతిథులకు రెన్యువల్ ఎప్పుడు..?
- ప్రభుత్వ మేనిఫెస్టోలో హామీ పరిస్థితేంటి..?
- నూతన నియామకాలతో వ్యవస్థలో గందరగోళం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థలో ప్రభుత్వం గతంలో రెగ్యులర్ అధ్యాపక నియామకాలు ఆపేసి కాంట్రాక్టు వ్యవస్థను 2001లో తీసుకువచ్చింది. దీనిని 2012లో ఆపివేసి అతిథి అధ్యాపక వ్యవస్థను తీసుకువచ్చింది. 2012 నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లో కాంట్రాక్టు సిబ్బందితో సమానంగా అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ నియామకాలు జరుగుతుండటంతో వ్యవస్థ మనగడే ప్రశ్నార్థకంగా మారడంతో అధ్యాపకులు ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు చేయాలని అధ్యాపకులు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకులకు రెన్యువల్ ఎప్పుడు..?

జిల్లాలో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 61 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరికి గత జులై 31 నాటి వరకు రెన్యువల్ చేశారు. 20 రోజుల నుండి తిరిగి రెన్యూవల్ ఆర్డర్ వస్తుందని ఎదురుచూస్తున్న అధికారులు స్పందించకపోవడంతో వారి తీరును నిరసిస్తూ హైదరాబాద్ ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అయిన ఇంకా రెన్యువల్ రాకపోవడంతో ఎదురు చూడడం తప్ప చేసేదేమీ లేకుండా తయారైంది.

ప్రభుత్వ మేనిఫెస్టో అమలు చేసేనా..?

కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా అతిథి అధ్యాపకుల సమస్యను మేనిఫెస్టోలో పొందుపరిచింది ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, 12 నెలల వేతనం ఇస్తూ ప్రస్తుత వేతనాన్ని రూ.42 వేలకు పెంచుతామని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా 1654 మంది అధ్యాపకులు ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని తమకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రితో సహా అందరూ మంత్రులను అధ్యాపకులు వేడుకున్నారు. ప్రభుత్వం కూడా మేనిఫెస్టో అమలు చేస్తామని చెబుతోంది. ఏం జరుగుతుందనేది కాలమే నిర్ణయిస్తుంది.

జెఎల్ నియామకలతో గందరగోళం

గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టుల భర్తీ కోసం 1364 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల క్రితం పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించడంతో పాటు ఈనెల 5వ తేదీ నుండి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తోంది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ ఐదు వరకు కొనసాగి 13న వారికి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనితో 12 సంవత్సరాల నుండి ప్రభుత్వ కళాశాల బలోపేతం కోసం కృషి చేయడంతో పాటు 8 నెలల వేతనంతో 12 నెలలు పనిచేసిన అతిథి అధ్యాపక వ్యవస్థ గందరగోళంలో పడింది.

ఉద్యోగ భద్రత కల్పించి ఆటో రెన్యువల్ ఇవ్వాలి
శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్షుడు



12 సంవత్సరాలుగా ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి మేము ఎంతగానో కృషి చేస్తున్నాం. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఆటో రెన్యువల్ అమలు చేయాలి. ప్రస్తుతం నూతన అధ్యాపకులు వస్తున్న నేపథ్యంలో వ్యవస్థ ఉనికి ప్రమాదకరంగా మారింది. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం మా గోడు విని సమస్య పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా 1600 కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుంది. మాకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి ఆటో రెన్యువల్ ఇవ్వాలి.

మహిళా శక్తి పథకం యూనిట్లు ప్రారంభించాలి
- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి పథకంలో పొందుపరిచిన అంశాలకు సంబంధిత యూనిట్లను జిల్లాలో త్వరగా ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాంలతో కలిసి మహిళా శక్తి పథకం యూనిట్ల నిర్వహణపై ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి పథకంలో భాగంగా జిల్లాకు కేటాయించిన యూనిట్ల నిర్వహణ త్వరగా ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను ప్రోత్సహించే విధంగా పథకంలో 23 రకాల యూనిట్లను నిర్వహించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, ఈ క్రమంలో అర్హత గల లబ్ధిదారులను గుర్తించి క్షేత్రస్థాయిలో యూనిట్లను ప్రారంభించే విధంగా చూడాలన్నారు. క్యాంటీన్లు, చేపల పెంపకం, డైరీ, కోళ్ల ఫారం, ఎంటర్‌ప్రైజెస్ యూనిట్లను తక్షణమే ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళా సంఘాలకు స్త్రీ నిధి పథకం కింద రుణాలు, బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, అధికారులు పథకాల అమలులో నిర్లక్ష్యం వహించకూడదని, విధులలో అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డైరీ ఫార్మ్ ఏర్పాటులో ఏపీఎం, సీసీలు వైద్యాధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం సారయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదు
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేదని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేయలేదని పార్టీ అధిష్టానం పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పక్కన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా నాయకురాలు సరస్వతితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. రుణమాఫీ ప్రక్రియ 100శాతం పూర్తి కాలేదని చర్చకు రావాలని సవాల్ విసిరారు. కల్యాణ లక్ష్మి పథకంలో ఇస్తామన్న తులం బంగారం ఏమైందని, రైతు భరోసా రూ.15000 పెంపు ఎక్కడికి వెళ్లిందని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగిందని అధికార పార్టీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనేక మంది రోజు బ్యాంకుల చుట్టూ తిరగడం కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి రైతుకు రుణమాఫీ అమలు చేసే వరకు అధికార పార్టీపై ఒత్తిడి తీసుకురావడం మానే ప్రసక్తి లేదన్నారు. రైతులు, ప్రజల పక్షాన పోరాడుతూనే ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ కాంగ్రెస్ తప్పులను ఎండగడతామని హెచ్చరించారు. అంతకు ముందు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్‌ను రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రహస్యంగా జరుగుతున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్‌ను రద్దు చేయాలని కాగజ్‌నగర్‌కు చెందిన జాడి దీపక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ టెండర్ ప్రక్రియ పూర్తిగా రహస్యంగా జరుగుతుందన్నారు. ప్రచురణలో లేని దినపత్రికల్లో ప్రకటన ఇచ్చి అనేక నిబంధనలు పెట్టి పాతవారికి మళ్లీ ఏజెన్సీ అప్పజెప్పే ప్రయత్నం అధికారులు చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో కూడా ఇటువంటి పరిస్థితి లేదన్నారు. ఇలా ఎంపిక చేసిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలో నిరుద్యోగుల వద్ద నుండి రూ.లక్షలు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే వాటిపై చర్యలు తీసుకొని ఏజెన్సీల ఎంపిక ప్రక్రియ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి
- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వనమహోత్సవం కార్యక్రమంలో నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించుకోవాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాలని, "నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద" అని నినాదంతో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ దత్తారాం, అడిషనల్ డీఆర్‌డీఓ రామకృష్ణ, సహాయ ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళ చట్టాలపైన అవగాహన



నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ విద్యార్థులకు మహిళ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాగాజ్‌నగర్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైతే ఎవరిని సంప్రదించాలని, ఎవరికి ఫిర్యాదు చేయాలో వివరించారు. సామాజిక మాధ్యమాల అయినా ఫేస్బుక్, వాట్సప్, ఇన్స్టాగ్రామ్ వంటి వాటిని వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన వివరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని పేర్కొన్నారు. షీ టీం కాగాజ్‌నగర్ ఫోన్ నంబర్ 8712670565కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నారాయణ్ సింగ్, షీ టీం సభ్యులు రమాదేవి, సునీత, బ్లూ కోర్ట్ రవీందర్, భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల వాడకం తగ్గించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రైతులు పంటల సాగులో ఎరువుల వాడకం తగ్గించాలని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. గురువారం ఆయన మండలంలోని రేగులగూడ, లైన్‌గూడ గ్రామాలలో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. మితిమీరిన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోయే అవకాశముంటుందన్నారు. ఇది పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. అదేవిధంగా రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్నా తనను కానీ, వ్యవసాయ విస్తరణాధికారులను కాని సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
- ఈసీఐఎల్ ప్రతినిధి ఆర్.రమేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఈసీఐఎల్ హైదరాబాద్ ప్రతినిధి ఆర్.రమేష్ అన్నారు. గురువారం జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టి కొనసాగుతున్న పనుల పురోగతిని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, పీవీటీజీ పాఠశాలను సందర్శించి ఆయా పాఠశాలలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.34.08 లక్షల నిధులతో జిల్లాలోని 15 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు 500 డ్యూయల్ డెస్కులను అందించడం జరిగిందని, రూ.36.15 లక్షల నిధులతో పీవీటీజీ, ప్రభుత్వం బాలుర గురుకుల పాఠశాలలో తరగతి గదులు, భోజనశాల, వంటశాల, నీటి సరఫరా మోటార్లు, మూత్రశాలలు, మరుగుదొడ్ల మరమ్మత్తు పనులు చేపట్టి పురోగతిలో ఉన్నాయని, మిగతా పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-హాజీపూర్



మండలంలోని గుడిపేట శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎండీ మహమూద్(58) మృతి చెందాడు. హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ కథనం మేరకు సంఘటనా వివరాలు ఇలా ఉన్నాయి.. గుడిపేట గ్రామానికి చెందిన ఎండీ మహమూద్ బుధవారం కూలీ పనికి వెళ్లి తిరిగి జాతీయ రహదారిపై నడుచుకుంటూ వస్తుండగా రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహమూద్ తీవ్రంగా గాయపడటంతో వెంటనే 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నాడు. కుమారుడు సలీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద..

నవతెలంగాణ-హాజీపూర్



మండలం నర్సింగాపూర్ గ్రామ పంచాయతీలోని రాజరాజేశ్వర రైస్మిల్ వద్ద గురువారం నాటుదాం ఒక చెట్టు.. అమ్మ పేరు మీద అనే కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. మండలంలోని గ్రామాల్లో మొక్కలు నాటగా ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ భాధ్యతగా అమ్మ పేరు మీద మొక్క నాటాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ కిషన్, ఎంపీడీఓ మధుసూధన్, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య. ఈసీ శ్రీనివాసరెడ్డి, టీఏ అన్నమని, పంచాయతీ కార్యదర్శి స్వరూప, రైస్మిల్ యజమాని రాజేశం, పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ రైతులను మోసం చేసింది

- మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

నవతెలంగాణ-హాజీపూర్

కాంగ్రెస్ రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఎమ్మెల్యే దివాకర్ రావు విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న దివాకర్ రావు మాట్లాడారు. రూ.రెండు లక్షలు బ్యాంక్‌లకు పోయి తెచ్చుకోండీ మేము అధికారం లోకి రాగానే డిసెంబర్ 9 లోపు ఆ రుణాలు మాఫీ చేస్తామని రైతులను మోసం చేశారన్నారు. 9 నెలలు గడుస్తున్నా ఇంకా రుణమాఫీ కాలేదని తెలిపారు. కేసీఆర్ రైతు పక్షపాతి, బీఆర్ఎస్ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారు. కాంగ్రెస్ హయాంలో రోడ్లెక్కల్సిన పరిస్తితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జీవన్ రావు, నహీం పాషా, గోళ్ళ శ్రీనివాస్, బేర పోచయ్య, వెంకటేష్, తిరుపతి లు పాల్గొన్నారు.

మంచిర్యాల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ల ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులు అందరికీ రుణమాఫీ అమలు చేయలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణలో నిర్వహించిన రైతు బీఆర్ ఎస్ ధర్నా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా కింద రూ.15 వేల రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, పట్టణం అధ్యక్షుడు గాదె సత్యం పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేట మండల కేంద్రంలో రైతులందరికి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు. వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మానిక్రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచులు ఆడె బాదు, అజ్మీర తిరుపతి పాల్గొన్నారు.



హాజీపూర్‌లో..

లక్సెట్టిపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర పిలుపుమేరకు స్థానిక ఐబీ వద్ద ఆ పార్టీ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ అమలు చేయాలని అన్నారు. అలాగే రైతు భరోసా కింద రూ.15 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. లేని పక్షంలో రాబోవు రోజుల్లో పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, మున్సిపల్ వైస్ చైర్మెన్ శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, యూత్ అధ్యక్షుడు అంకతి గంగాధర్, శ్రీనివాస్, చాంద్ పాల్గొన్నారు.

వేమనపల్లి : ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షలు మాఫీ చేయాలని గురువారం మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారు. రుణమాఫీ చేయడంలో అడ్డగోలు ఆంక్షలతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నందుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహశీల్దార్ కమల్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేమనపల్లి మాజీ సర్పంచ్ కుబిడే మధుకర్, సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం, మాజీ సర్పంచులు కొండగొర్ల బాపు, మోర్ల పద్మ మొండి, పాల్గొన్నారు.

జన్నారం : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాన రహదారిపై బయటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రైతులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్దన్ మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అలీ ఖాన్, ఉపాధ్యక్షుడు సంతోష్, రాజేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్, జిల్లా నాయకులు భరత్ కుమార్, కమ్మల విజయ ధర్మ పాల్గొన్నారు.


లక్షెట్టిపేటలో..


మంచిర్యాలలో..


కాసిపేటలో..


వేమనపల్లిలో..

మున్సిపల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. పలు కాలనిల్లో చేపట్టిన పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం యాపల్, రామాలయం వీధిలో పారిశుధ్య నిర్వహణను తనిఖీ చేశారు. గాంధీనగర్, మార్కెట్ ఏరియాలో గల సింగరేణి జీవీపీ గార్బేజి వర్ల రేబుల్ పాయింట్, పోచమ్మ గుడి దగ్గరలోని గార్బేజి పాయింట్లను తనిఖీ చేసి వెంటనే తొలగించాల్సిందిగా సింగరేణి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సుమతి, అసిస్టెంట్ ఇంజనీర్ ఏ అచ్యుత్, శానిటరీ ఇన్స్పెక్టర్ వి శ్యాంసుందర్, మేనేజర్ పి కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు డి లక్ష్మి రాజు, ఏ రాణి, బి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఎంఏ సమీర్, జూనియర్ అసిస్టెంట్లు, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యంగా విద్యార్థులకు కృత్రిమ అవయవాలు అందిస్తాం

- డీఈఓ ఎస్ యాదయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రత్యేక అవస రాలున్న విద్యార్థులు సాధారణ విద్యార్థులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని వారికి అవసరమైన ఉపకరణాలు ప్రభుత్వం అందిస్తోందని, మనోధైర్యం కోల్పోకుండా జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని, ప్రభుత్వం దివ్యాంగులు ఆర్థిక అభివృద్ధికి ఎన్నో రకాల రాయితీలు కల్పిస్తుందని జిల్లా విద్య శాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలీమ్ కో) తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల విద్యార్థులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహించారు. 185 మంది దివ్యాంగ విద్యార్థులు హాజరు కాగా విద్యార్థులకు అవసరమైన వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు అందజేస్తమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నమోదైన 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలకు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహిత విద్య కోఆర్డినేటర్ కె చౌదరి, మండల విద్యాధికారి జె పోచయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, డిస్టిక్ సైన్స్ ఆఫీసర్ ఎస్ మధు బాబు, అలిన్ కో డాక్టర్ రూపేష్ కుమార్, ప్రభుత్వ డాక్టర్ శివ ప్రతాప్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

- యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్

నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్‌లో ఉంటే ఉండండి లేకపోతే వెళ్ళండి అని కించపరిచే విదంగా వాక్యలు చేయడం చాలా బాధాకరమని, అలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుల రాకేష్ పేర్కొన్నారు. గురువారం కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామంలో మండల యువజన కాంగ్రెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొందరు నాయకులు మా నాయకులను కించపరుస్తున్నారని, గ్రూప్ రాజకీయాలకు ఆజ్యం పోసే విధంగా కార్యకర్తలను రెచ్చగొడుతున్నారని, ప్రెస్ మీట్‌లు పెట్టి మా పెద్ద నాయకులను అవమానించడం సరికాదన్నారు. గత 25 సంవత్సరాల నుండి కాంగ్రెస్‌నే నమ్ముకుని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో పని చేసి ఈ రోజు ఈ స్థాయికి వచ్చిన వాళ్ళను నిన్న మొన్న రాజకీయం చేసే వాళ్ళు పార్టీ నుండి వెళ్ళిపో అనడం హాస్యాస్పదమన్నారు. గడ్డం వినోద్ గెలుపు కోసం మేము కూడా కష్టపడి పని చేశామని, కాని ఈ రోజు మా నాయకులకు ఏ రోజు కూడా ప్రోటోకాల్ పాటించకుండా జిల్లా అధ్యక్షురాలు సురేఖమ్మ ఫోటో, స్థానికంగా పుట్టి పెరిగిన ప్రేమ్ సాగర్ రావు ఫోటోలు పెట్టకుండా వారిని అవమానించడం, వాళ్ళ ఫోటోలు పెట్టిన కార్యకర్తలను బెదిరించడం చేయడం జరుగుతుందన్నారు. ప్రేమ్ సాగర్ రావు లేకపోతే ఉమ్మడి ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ ఉండకపోయేదని, వారి మూలంగానే అధికారంలో లేని రోజులలో కూడా కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారని, ఈ రోజున వారిని గాని మండల నాయకులను, ప్రజాప్రతినిధులను కించపరిచే విధంగా వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు తిరుపతి, చెండె నవీన్, గణేష్, సాయి పున్నం, విద్యాసాగర్, రాము, నరేష్, వసంత, ప్రసాద్ పాల్గొన్నారు.

బాలికలను చదివిద్దాం.. బాలికలను రక్షిద్దాం..

నవతెలంగాణ-జైపూర్

ఆడపిల్లల సంరక్షణ, మహిళా సాధికారత పట్ల మహిళలు సరైన అవగాహన కలిగి ఉండాలని ఆర్థిక అక్షాస్యత నిపుణురాలు లిప్సిక అన్నారు. భీమారం మండలం పొలంపల్లి గ్రామ పంచాయతీ పరిది పెర్లా ఆఫ్ ఇండియా పాఠశాల విద్యార్థులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన సదస్సులో బాలికలను రక్షిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, ఆన్‌లైన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్, ఆడ పిల్లల ప్రాముఖ్యత, మహిళల సాధికారత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళల హెల్ప్ లైన్ 1930, సఖి సర్వీసెస్ హెల్ప్ లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, డిజిటల్ ఎడ్యుకేషన్, పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 100, సీనియర్ సిటిజన్స్ హెల్ప్ లైన్ నెంబర్ 14567, ఫోక్స్ యాక్ట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్ పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

నవతెలంగాణ-మందమర్రి

యాపల్ ప్రాంత యువకులు మానవత్వాన్ని చాటుకున్నారు.

మంచిర్యాలకి చెందిన ఫోటోగ్రాఫర్ ఆశిష్‌కు సంబంధించిన 35000 జింబల్ బుధవారం సాయంత్రం సమయంలో మిస్ అయ్యింది. మేడారంలో జింబల్‌ను యాపల్ ప్రాంత యువకులు బి తేజ, ఏ అరుణ్, ఎం రవికుమార్‌లు గమనించారు. గురువారం మందమర్రి ఫోటో అండ్ వీడియో అసోసియేషన్ అధ్యక్షుడు పసుల వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి ఆడెపు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ స్టూడియోలో జింబల్‌ను బాధితుడు ఆశిష్‌కు అందచేశారు. తేజ, అరుణ్, రవి కుమార్ అభినందించారు.



ఎస్‌బీఐ బ్యాంకులో ఘరానా మోసం

నవతెలంగాణ-జన్నారం



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ ప్రకటించడంతో, రైతులతో బ్యాంకులలో హడావుడి మొదలైంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్లు, రైతుల వద్ద నుంచి 20 నుంచి 30 వేలు వసూలు చేస్తూ, రైతులను బురిడీ కొట్టిస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా మోసపోతున్నారు. వివరాల్లోకెళ్తే జన్నారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఎఫ్ఓఎస్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ ప్రయివేటు ఉద్యోగి పారంకుశం సాయిరాం, ఆ బ్యాంకులో రుణమాఫీ అయిన రైతుల వద్ద నుంచి, 20 నుంచి 30 వేల రూపాయలు వసూలు చేసి, వారికి రుణాలు మంజూరు చేస్తున్నాడు. గురువారం జన్నారం మండలంలోని హాస్టల్ తండా గ్రామానికి చెందిన మేక ఎర్రయ్య అనే రైతు, రూ.లక్ష రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దానికిగాను ఆ బ్యాంకు ప్రయివేటు ఉద్యోగి ఎఫ్ఎస్ఓ సాయిరాం, రూ.30,000 ఇస్తేనే నీకు రుణం వస్తుందని, లేకుంటే రాదని ఆ గిరిజన రైతును బెదిరించాడు. ఆ రైతు తన ఇంటి పక్కనే ఉన్న తిరుపతి అనే మరో వ్యక్తికి తెలపడంతో, వారి ఇరువురు కలిసి రూ.పది వేలు ఇస్తాము మా దగ్గర లేవని బ్రతిమిలాడారు. సాయి రూ.20000 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చివరికి రూ.15 వేలు తన ఇంటి వద్దకు తీసుకువచ్చి ఇవ్వాలని, అనడంతో రైతు శ్రీలంక కాలనీలో ఉన్న తన ఇంటికి వెళ్లి రూ.15 వేలు ఇచ్చాడు. ఇచ్చిన తర్వాత రైతు కొంత గొడవ చేయడంతో నీ డబ్బులు నాకు వద్దు నాకు ఎందుకు ఇచ్చావు అని సాయి మళ్లీ అతనికి తిరిగి ఇచ్చాడు. అతను తీసుకోకుండా నువ్వైతే బ్యాంకుకు రా అని సదరు రైతు బ్యాంక్‌కు వెళ్లి గొడవ చేశాడు. వెనకాలనే వచ్చిన సాయి కూడా బ్యాంక్ మేనేజర్, ముందు రైతుతో వాగ్వాదానికి దిగాడు. రెండు రోజుల క్రితం మరో రైతు లకావత్ బాబూలాల్ వద్ద నుంచి కూడా రూ.30 వేలు డిమాండ్ చేసి తీసుకున్నాడని, అందుకు ఆ రైతు రూ.20 వేల ఫోన్ పే ద్వారా 10000 నెట్టికాస్ ఇచ్చాడని, కవ్వాల్ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేశారు. రుణమాఫీ అయిన ప్రతి రైతు వద్ద నుంచి సాయి అనే ప్రయివేటు ఎఫ్ఓఎస్ కాంట్రాక్టు ఉద్యోగి, రూ.20 నుంచి రూ.30 వేలు వసూలు చేస్తున్నాడని రైతులు, పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. గొడవ ముదరడంతో స్థానిక పోలీసులు అతన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై బ్యాంకు మేనేజర్ పి మహేష్‌ను నవతెలంగాణ వివరణ కోరగా సాయి అనే వ్యక్తి బ్యాంకులో ఎఫ్ఓఎస్‌గా విధులు నిర్వహిస్తున్నాడని, అతను గ్రామాల్లోకి వెళ్లి రైతుల వివరాలు సేకరించి ఇస్తేనే మేము ఆ రైతులకు బ్యాంకు రుణాలు అందిస్తున్నామన్నారు. అతను రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న సంగతి మా దృష్టికి రాలేదన్నారు. ఈ రోజు రూ.15 వేలు తీసుకోవడం మా దృష్టికి వచ్చిందన్నారు. అతనిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నాయిబ్రాహ్మణ మహిళా ఉద్యోగికి అవమానం

- సంబంధిత అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్

నవతెలంగాణ-హాజీపూర్

స్వాతంత్ర దినోత్సవం రోజులు ఓ నాయిబ్రాహ్మణ మహిళా ఉద్యోగికి జరిగిన అవమానం ఆలస్యంగావెలుగు చూడటంతో నాయిబ్రాహ్మణ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ మేరకు ఈ ఘటనపై గురువారం హాజీపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు మందపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కంది శ్రీనివాస్ తమ కులంపై వివక్ష చూపితే ఖచ్చితంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. మంథని సివిల్ ఆస్పత్రిలో విష్ణుభక్తుల పూర్ణిమ గత కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ వర్కర్గా పని చేస్తుందని గుర్తు చేస్తూ గర్భిణీకి పురుడు పోయడం, ఆ బిడ్డకు, తల్లికి స్నానాదికార్యక్రమాలు నిర్వహించడం అంటే జన్మం నుంచి మొదలు చనిపోయే వరకు నాయిబ్రాహ్మణ మహిళలు అనాదిగా వస్తున్న ఆచారాన్ని పాటిస్తూ జీవనం సాగిస్తున్నారని ఈ క్రమంలోనే మంథని సివిల్ ఆస్పత్రిలోపూర్ణిమ కాంట్రాక్ట్ కార్మికురాలిగా పని చేస్తుందని అన్నారు. అయితే స్వాతంత్ర దినోత్సవం రోజున జెండాఆవిష్కరణ అనంతరం సివిల్ ఆస్పత్రిలో సూపరింటెండెంట్గా పని చేస్తున్న రాజశేఖర్ పూర్ణిమతో తన బూట్లకు అంటిన మట్టిని తొలగించి శుభ్రం చేయాలని ఆదేశించి బూట్లను శుభ్రం చేయించుకోవడాన్ని భారత మాతను అవమానించినట్లుగా భావిస్తున్నామని ఈ ఘటనను యావత్ రాష్ట్ర నాయిబ్రాహ్మణ సేవా సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. మహిళా ఉద్యోగినులపై అధికారులు చెలాయిస్తున్న పెత్తనాన్ని తిప్పికొట్టాలని ఇది రాచరికపు పాలన కాదని పేర్కొంటూ ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని వెంటనే ఆ మహిళా ఉద్యోగికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయిబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకటేశం, మండల అధ్యక్షుడు ఆదిమూలం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ స్వర్ణలత పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీమ్‌లు పని చేస్తున్నాయి

- మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ హేమ

నవతెలంగాణ-మంచిర్యాల



రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని మహిళలు, అమ్మాయిల రక్షణకు షి టీమ్‌లు పని చేస్తున్నాయని మంచిర్యాల జిల్లా షి టీమ్ ఎస్ఐ హేమ పేర్కొన్నారు. గురువారం మంచిర్యాల పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, అమ్మాయిలు, పిల్లలలకు భరోసా కల్పించి వారిని రక్షించేందుకు షి టీం విభాగం పని చేస్తుందన్నారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మ హత్యలు, డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు, అమ్మాయిలను ఎవరైనా వేధించినట్లైతే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్కూల్, కాలేజీల వద్ద నిత్యం గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్త వ్యక్తులతో పరిచయాలు, ఎవరైనా వెంట పడడం లాంటివి చేస్తే తక్షణమే 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వేధింపులకు గురి అవుతున్న మహిళలు, అమ్మాయిలు ఏవరైన షి టీమ్ 6303923700 నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జ్యోతి, శ్రావణ్ పాల్గొన్నారు.

సాలరీ అకౌంట్‌తో అదనపు ప్రయోజనాలు

- ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు



నవతెలంగాణ-జైపూర్

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ శాలరీ అకౌంట్‌తో కాంట్రాక్ట్ కార్మికులకు అదనప ప్రయోజనాలు చేకూరనున్నట్లు ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎస్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికులకు హెచ్‌డీఎఫ్‌సీ ద్వారా శాలరీ అకౌంట్‌లు తెరిపించారు. సింగరేణి సీడీఎండీ బలరాం చొరవతో డైరెక్టర్ (పా) ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్త కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాల దృష్టితో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీతో కుదుర్చున్న ఒప్పందం ప్రకారం కాంట్రాక్టు కార్మికులు మృతి చెందితే రూ.20 లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. సదరు కాంట్రాక్టు కార్మికుడు డెబిట్ కార్డు నెలలో ఒకసారి ఉపయోగించినా రూ. 10 లక్షలు అదనపు బీమా అందుతుందని తెలిపారు. ప్రమాదం లో కార్మికుడు మృతి చెందితే ఆయన కుటుంబంలో 18 సంవత్సరాల లోపు పిల్లలు ఉన్నట్లయితే రూ.4 లక్షల ఆర్థిక సాయం అదనంగా అందనున్నట్లు తెలిపారు. కార్మికుడు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రోజుకు రూ.1000 చొప్పున గరిష్ఠంగా రూ.15 వేలు ఆర్థిక సాయం అదజేయనున్నారని అన్నారు. కాగా ఎస్టీపీపీలో ప్రారంభించిన మొదటి రోజు 100 మంది కాంట్రాక్టు కార్మికులతో ఖాతాలు తెరిపించినట్లు పేర్కొన్నారు.

కోర్టుకు హాజరుకాని వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-మంచిర్యాల

2016లో నమోదు అయిన గృహ హింస కేసులో నిందితుడిగా ఉన్న నస్పూర్‌కు చెందిన లగిశెట్టి సందీప్‌ను మంచిర్యాల మహిళ పోలీస్ స్టేషన్ పోలీసులు చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల మహిళ పోలీస్‌స్టేషన్ సీఐ కె నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా విదేశాల్లో తిరుగుతున్నాడని, నమ్మదగిన సమాచారం మేరకు ఇండియాకు వస్తున్నాడని తెలిసి మంచిర్యాల మహిళ పోలీస్‌స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్, నిస్సార్‌లు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకొని మంచిర్యాల కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నిందితుడికి 14 రోజుల శిక్ష విదించి జైలుకు తరలించినట్లు తెలిపారు. నాన్ బెయిలబుల్ కేసులో నిందితుడు గా ఉన్న సందీప్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించడంలో బాధ్యత యుతంగా విధులు నిర్వహించిన సిబ్బంది శ్రీనివాస్, నిస్సార్, రామేశ్వర్, నరేష్‌లను సీఐ అభినందించారు.

నానో డీఏపీ వాడకంపై అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం భట్‌పెల్లి, అందవెల్లి, ఆరెగూడ, మోసం, ఈజ్‌గాం, సీతానగర్ గ్రామాలలో కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ ఆధ్వర్యంలో నానో డీఏపీ వాడకంపై ప్రచారం నిర్వహించారు. ట్రాక్టర్‌పై ఆయా గ్రామాలకు వెళ్లి కొత్త టెక్నాలజీ ద్వారా ఉత్పత్తి అవుతున్న గ్రోమోర్ నానో డీఏపీ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కంపెనీ జోనల్ మేనేజర్ మనోజ్‌కుమార్, ప్రతినిధులు పాపిరెడ్డి, శ్రవణ్‌రెడ్డి, ప్రీతంరెడ్డి, రాజయ్య, తిరుపతి, రాజేష్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలను సందర్శించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-మందమర్రి



మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను ఎంపీడీఓ రాజేశ్వర్ గురువారం సందర్శించారు. తరగతి గదులు, పరిసరాలు శుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి పలు సూచనలు చేశారు. వంట గది, పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో నిర్వాహకులను అభినందించారు. అనంతరం విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

జ్వరంతో విద్యార్థిని మృతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని కౌసర్‌నగర్ ఏరియాకు చెందిన గుర్లె అనురాధ(11) అనే విద్యార్థినీ గురువారం జ్వరంతో మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. గుర్లె జగన్-హేమలత దంపతుల కూతురు అనురాధ లక్షెట్టిపేటలో ఎస్సీ హాస్టల్లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ఈ నెల 16న జ్వరం రావడంతో కాగజ్‌నగర్‌లోని సొంతింటికి చేరుకుంది. మూడు రోజుల్లో జ్వరం తగ్గగా బుధవారం మళ్లీ జ్వరం రావడంతో పట్టణంలోని ఓ ప్రయివేట్ వైద్యుని వద్ద చికిత్స చేయించారు. ఈ క్రమంలోనే ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో మంచిర్యాలకు తరలించారు. అక్కడ చికిత్సల అనంతరం వైద్యుల సూచన మేరకు గురువారం ఉదయం కరీంనగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది.

ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం భట్టుపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం సిర్పూరు పేపర్ మిల్స్ లిమిటెడ్, స్పర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యులు భానుప్రకాష్, సీఎస్ఆర్ రెనా బిల్వా, సిస్టర్స్ శ్రీవాణి, రేఖ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్పీఎం ప్రతినిధి తుమ్మ రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, పుష్పలత, మాజీ ఎంపీటీసీ పోచన్న పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి

నవతెలంగాణ-నార్నూర్

పారిశుధ్యం లోపించకుండ చూడాలని వైద్య సిబ్బందిని ఏజెన్సీ డీఎంహెచ్ఓ కుడిమేత మనోహర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో పారిశుధ్యం పనులను మురుగు కాలువలను పరిశీలించారు. ఎప్పటికప్పుడు సానిటేషన్ చేయాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాని ప్రతి మంగళవారం శుక్రవారం డ్రైడే నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో వేగం పెంచాలని కోరారు. వారి వెంట ఎంపీఓ స్వప్నశీల, డాక్టర్ రాంబాబు, హెచ్ఈఓలు తులసీదాస్, నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్ దాస్, సతవ్వ, వైద్య సిబ్బంది కైలాష్, శీల ఆశాలున్నారు.

దైవభక్తితోనే క్రమశిక్షణ

నవతెలంగాణ-తలమడుగు

దైవభక్తితోనే క్రమశిక్షణ అలవరుతుందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. గురువారం మండలంలోని అర్లి గ్రామంలో నెల రోజుల పాటు కొనసాగుతున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దైవభక్తి మార్గంలో నడిచిన వారే జీవితంలో క్రమశిక్షణగా మెలిగి అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. గ్రామస్తులు ఐక్యత పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనపర్తి చంద్రకాంత్, జక్కుల ప్రభాకర్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు భువనగిరి స్వామి, బీజేవైఎం మండలాధ్యక్షులు దాతాజీ కిరణ్, వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, గిరిజన మోర్చా అధ్యక్షులు భుజంగరావు, మాజీ ఎంపీటీసీ స్వామి, పాండు, హనుమంతు, గోవింద్, సురేందర్, అశోక్, శ్రీనివాస్, శ్రీకాంత్ పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు భీమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గంగారెడ్డి, కత్రాజ్ కృష్ణస్వామి, మాజీ సర్పంచ్ కిష్టన్న పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-మంచిర్యాల



రైల్వే ట్రాక్‌పై పడుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడిని బ్లూకోట్ కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాజ్ కుమార్ కాపాడారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్ వారిని అభినందించారు. గురువారం సాయంత్రం ఏసీసీ సమీపంలో 29 సంవత్సరాలు వ్యక్తి హరిదాస్ సాయి కృష్ణ రైల్వే ట్రాక్‌పై పడుకొని ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి వ్యక్తినీ విచారించి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్నారు. యువకుడి ప్రాణాలు కాపాడి మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌లోని అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి ప్రాణాలు కాపాడటంలో ప్రధాన పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు సత్యనారాయణ, రాజులను సన్మానించారు.

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువత నుండి స్కిల్ డెవలప్మెంట్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని ఆదిలాబాద్ బీసీ జిల్లా అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 రోజుల నాన్ రెసిడెన్షియల్ ఫ్రీ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను ఎల్లి హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ, కుషాయిగూడ, హైదరాబాద్' ద్వారా 100 మంది అభ్యర్థులకు హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం పూర్తయిన తరువాత అకాడమీ ద్వారా ప్లేస్మెంట్లు కూడా అందించబడతాయన్నారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4000 చొప్పున 3 నెలల పాటు స్టైపెండ్‌ను ఈ సంస్థ మంజూరు చేస్తుందన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్న ఎస్ఎస్‌సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన అభ్యర్థులపై శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీబీసీస్టడిసర్కిల్.సీజీజీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉండాలని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుందని, మరిన్ని వివరాలకు 08732221280 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నేర రహిత సమాజం కోసం కృషి చేయాలి

- ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు
- నెలవారి నేర సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేర రహిత సమాజం కోసం పోలీసులు కృషి చేయాలని దీని కోసం జిల్లాలో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపాలని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ల వారీగా కేసుల పురోగతి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎప్పటికప్పుడు సమాచారం వచ్చేలా చూసుకోవాలన్నారు. నేరం జరిగిందని తెలియగానే ఆ ప్రదేశంలో ఉండేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. డయల్ 100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లు, నేరస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అనారోగ్య బారిన పడిన వారిని గుర్తించి రౌడీషీట్లు తొలగించేలా కృషి చేయాలన్నారు. దేశంలో వచ్చిన నూతన చట్టాలను అవగాహన చేసుకుని కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి, సైబర్ నేరాల నివారణ కోసం కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలు గుర్తించి నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గణేష్ ఉత్సవాల సక్రమ నిర్వహణకు కమిటీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం విధుల్లో కృషి చేసిన ఉత్తములకు అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో రెబ్బెన, జైనూర్ సీఐలు చిట్టిబాబు, రమేష్, కాగజ్‌నగర్ టౌన్ ఎస్ఐ డి రమేష్, సిబ్బంది ఉమేశ్వర్ ఉన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితున్ని ప్రాణాపాయం నుండి కాపాడిన రెబ్బెన పోలీస్ స్టేషన్‌కు చెందిన డబ్ల్యూపీసీలు స్వప్న, హారిక, రజిత, లావణ్యలను అభినందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, డీసీఆర్బీ సీఐ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన విద్యార్థులు



- ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్
- 3 గంటలకు గోడ దూకి 5 కిలో మీటర్ల ప్రయాణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రిన్సిపాల్ వేధింపులకు గురి చేస్తుందని ఆరోపిస్తూ విద్యార్థులు పోలీసు స్టేషన్ మెట్లెక్కారు. మావల మండల కేంద్రంలోని జైనథ్ మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు గురువారం టూ టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట బైటాయించి న్యాయం చేయాలని కోరడం చర్చనీయంశం అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని లోనికి పిలిచారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ సంగీత తమను చిత్రహింసలు పెట్టుతుందని న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చామన్నారు. తమ సమస్య ఎవరికి చెప్పాలో అర్థం కాక పోలీస్ స్టేషన్‌కు వచ్చామని, తమ బాధలు వర్ణణాతీతమని వాపోయారు. గతంలో సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులకు తెలియజేయడంతో తమపై కక్ష్య పెట్టుకున్నారని విద్యార్థులు ఆరోపించారు. భోజనం సరిగ్గా ఉండదని, కరెంట్ సౌకర్యాం కూడా లేదన్నారు. దీనిపై అడిగితే మీరు నన్ను ప్రశ్నించే స్థాయికి వచ్చారని బయపెడుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు చెప్పకుండా తెల్లవారు జామున 3 గంటలకు గోడ దూకి పోలీసు స్టేషన్‌కు వచ్చామన్నారు. సమస్యల గురించి అడిగితే పట్టించుకోవడం లేదని, కలెక్టర్ వస్తున్నారని తెలిసి దోమల మందు కొట్టించారని ఆరోపించారు. మంచి భోజనం పెట్టాలని అడిగితే డిప్యూటి వార్డెన్ చెప్పుతో కొడుతానని చెప్పారని తెలిపారు. ఇక్కడి విషయాలు ఎవరికైన చెప్పితే టీసీ, బోనోఫైడ్‌పై బ్యాడ్ కండక్ట్ అని రాసి ఇస్తామని భయభ్రంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసేంత వరకు తాము పాఠశాలకు వెళ్లబోమని స్పష్టం చేశారు. మూడు గంటల పాటు స్టేషన్‌లోనే కూర్చుని నిరసన తెలపడంతో టూ టౌన్ సీఐ కరుణాకర్ అక్కడికి అల్పాహారం తెప్పించి తినిపించారు. ఆ తర్వాత వారి సమస్యలను ఎస్పీ ద్వారా కలెక్టర్‌కు చేరవేశారు. ఆర్డీఓతో విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో హైస్కూల్ విద్యార్థులు ఆందోళన విరమించి తిరిగి రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్ పంచాయతీ పోలీస్ స్టేషన్‌కు చేరిన ఘటన ఆదిలాబాద్‌లో చర్చనీయాంశమైంది.

సహకార సంఘంలో ఆన్‌లైన్ అప్‌డేట్ లేక గందరగోళం

- అప్పులు కట్టిన రుణమాఫీ రాలేదంటున్న రైతులు



నవతెలంగాణ-బెజ్జూర్

సహకార సంఘం కార్యాలయంలో రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్డేట్ లేక రుణమాఫీ అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. సహకార సంఘం కార్యాలయంలో 2017 నుండి ఇప్పటి వరకు సంఘంలో రుణాలు పొందిన రైతుల వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయడంలో సీఈఓల నిర్లక్ష్యం వహించడం వల్ల, రైతులు రుణమాఫీకి అనర్హులవుతున్నారు. రుణాలు పొందకుండా రైతులు పొందినట్లు, అత్యధికంగా రుణాలు పొందినట్లు రుణమాఫీ జాబితాలో రావడంతో రైతులు రుణాలకు అనార్హులవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కానీ అధికారుల అశ్రద్ధ వల్ల రుణాలు పొందలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెంచికల్‌పేట మండలం ఎలుకపెల్లి గ్రామానికి చెందిన చప్పిడే రిక్కుబాయి అనే మహిళ బెజ్జూరు సహకార బ్యాంకులో ట్రాక్టర్ రుణం పొంది పూర్తిగా చెల్లించిన ఆన్‌లైన్‌లో అప్‌డెట్ కాకపోవడం వల్ల రుణం చెల్లించినట్లు ఉండడంతో రుణమాఫీ అందక నష్టపోయామని చప్పిడి రిక్కు బాయ్ కుమారుడు కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి పేరిట రూ.1,60,000, తన తల్లి బాయ్ పేరిట లక్షణాలు బ్యాంకుల్లో అప్పు ఉన్నట్లు వ్యవసాయ శాఖ స్టేటస్లు చూపించడంతో రుణమాఫీ రాక నష్టపోయామని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ డబ్బులు పూర్తిగా అప్పటి సీఈఓ వెంకటేశ్వర్ గౌడ్‌కు చెల్లించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో రుణమాఫీ పొందలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమే సీఈఓ పర్ష సంజీవ్ మాట్లాడుతూ సాంకేతిక కారణాలవల్ల ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో తప్పు జరిగిన మాట వాస్తవమే అన్నారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామ హామీ ఇచ్చారు.

మండల వ్యవసాయాధికారిగా కృష్ణ

నవతెలంగాణ-హాజీపూర్

మండల వ్యవసాయాధికారి(ఏఓ)గా డి కృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం హాజీపూర్లోని ఏఓ కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఏఓగా పని చేసిన కృష్ణ హాజీపూర్‌కు బదిలీపై వచ్చారు. ఇక ఇక్కడ ఏఓగా పని చేసిన మార్గం రజిత డివిజనల్ వ్యవసాయాధికారికి పీఏగా బదిలీ అయ్యారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-వేమనపల్లి

సమయపాలన పాటించని ప్రభుత్వ ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ అన్నారు. గురువారం మండలంలోని రాజారం, మంగనపల్లి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ ఉదయం 9 నుండి 4 గంటల వరకు ఉండాల్సిన ఉపాధ్యాయులు మూడు గంటలకే స్కూళ్ల మూసేస్తున్నారని అన్నారు. గ్రామ ప్రజలతో మాట్లాడినప్పుడు టీచర్లు ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. టీచర్ల నిర్లక్ష్య మూలంగానే ప్రవేట్ పాఠశాలకు ఆశ్రయిస్తున్నారని స్పష్టం అవుతోందన్నారు. తక్షణమే సంబంధిత జిల్లా అధికారులు స్పందించి సమయపాలన పాటించని రాజారం, మంగేనపల్లి టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇరాక్‌లో చింతగూడ వాసి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన సంపంగి రాజమల్లు(35) ఇరాక్ దేశంలో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమల్లు గత ఏడు సంవత్సరాల క్రితం ఇరాక్ దేశానికి బతుకుతెరువు కోసం వెళ్లి, కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం కంపెనీకి పనికి వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. రాజమల్లి మృతితో తండ్రి పెద్ద మల్లయ్య తల్లి రాజవ్వలు, గ్రామంలో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తన కుమారుని శవాన్ని త్వరగా ఇండియాకు తీసుకురావాలని పెద్ద మల్లయ్య తల్లి రాజవలు కోరుతున్నారు. అందుకు ప్రభుత్వం స్పందించాలని వేడుకున్నారు.

ట్రస్మా మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల యాజమాన్య అసోసియేషన్ (ట్రస్మా) మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలు తెలిపారు. అధ్యక్షుడిగా అమరగొండ సతీష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కస్తూరి సతీష్ కుమార్, కోశాధికారిగా ఎర్ర సంపత్ కుమార్‌లను ఏకాగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. వీరి పదవి కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల కోసం ట్రస్మ పోరాడుతుందని వారు పేర్కొన్నారు.

మూడు రోజుల్లో రైతులకు న్యాయం చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులకు మూడు రోజుల్లో న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, బ్యాంక్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారం రోజుల నుండి సహకార సంఘంలో అక్రమాలు జరిగినాయంటు ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్నాయన్నారు. సమగ్ర విచారణ జరగకుండా వ్యవహారం పక్కతోవ పడుతుందని, రుణమాఫీకి ప్రభుత్వం వారం రోజులు స్పెషల్ డ్రైవ్ పెట్టిందన్నారు. సస్పెండ్ అయిన సీఈఓను ఆసిఫాబాద్ బ్యాంక్ మేనేజర్, డీసీఓను కోఆర్డినేట్ చేస్తూ ముగ్గురిని కలిపి సంబంధిత రైతుల ఖాతాలు తప్పులు సరిదిద్ది బ్యాలెన్స్ షీట్స్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లె ప్రకాష్ రావు, మాజీ జడ్పీటీసీపెసరి మదునయ్య, మాజీ ఎంపీటీసీ ముంజం రవీందర్, మాజీ సర్పంచ్ దుర్గం రవీందర్, వెంకటేశం మాజీ ఆలయ కమిటీ చైర్మన్, కోవూరు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ నానాజీ, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

హామీలతో రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎన్నికలకు ముందు రైతులకు ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్ ఇపుడు అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయక రైతులను నట్టేట ముంచుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గురువారం రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక రాజీవ్‌చౌక్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్డీఓ సురేష్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రూ. 2 లక్షల రుణమాఫీని రైతులందరికీ అమలు చేస్తే రూ. 40 వేల కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, కాని ఇప్పటి వరకు కేవలం రూ. 7వేల కోట్లు మాత్రమే రైతుల ఖాతాలలో జమ అయ్యాయని తెలిపారు. కనీసం సగం మంది రైతులకు కూడా లబ్ది జరగలేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజవర్గ ఇన్‌ఛార్జి లెండుగురె శ్యాంరావుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాసిన మున్సిపల్ కమిషనర్
- ఇదివరకే ఇంటి నెంబర్ తొలగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



OFFICE OF THE MUNICIPAL COUNCIL, KAGHAZNAGAR
DIST: KUMURAM BHEEM ASIFABAD

కాగజ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వివాదాస్పద భూమిని రాపెల్లి భాగ్యలక్ష్మి అనే మహిళ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోగా ఆ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఆసిఫాబాద్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. ఈ నెల 18న 'రూ. కోట్ల స్థలం – ఆక్రమణల పర్వం' శీర్షికతో నవతెలంగాణ దినపత్రిలో వార్త ప్రచురితమైన విషయం తెల్సిందే. ఈ వార్త ఆధారంగా పట్టణంలోని సర్వే నెం. 147/2లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వివాదాస్పద భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 1103/2024ను రద్దు చేయాలని కమిషనర్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ నెం. ఎ1/790/2024 తేది 21.08.2024 ద్వారా లేఖ పంపించారు. ఈ స్థలంలో ఇదివరకే మున్సిపల్ ద్వారా కేటాయించబడిన ఇంటి నెం. 1-16-552/4/3/ఎ/1ను కూడా ఇది వరకే రద్దు చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

గుట్కా పట్టివేత

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచి గుట్కా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఎస్ఐ నవీన్ గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో దాదాపుగా రూ. 14 వేల విలువ గల గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నామన్నారు. గుట్కా విక్రయించిన అప్పు, అస్లంలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ తెలిపారు. మండలంలో నిషేధిత గుట్కను ఎవరైనా విక్రయిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వన్‌టౌన్ ఎస్సైని కలిసిన సాంగిడి గ్రామస్తులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ వన్ టౌన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అశోక్‌ను బేల మండలం సాంగిడి గ్రామస్తులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీతో ఉన్న ఫోటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ ఎస్సై అశోక్ పోలీసులకు యువత సహకారం ఎంతో అవసరమని, వారు పోలీసులకు అవినాభావ సంబంధంతో ఉంటూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకారం అందించాలని ఆయన యువకులను కోరారు. వన్ టౌన్ ఎస్సై ని కలిసిన వారిలో రఘుకుల్ రెడ్డి, సామ రూపేష్ రెడ్డి, కైపెల్లి జైపాల్, బరే స్వామి, సిద్రప్ సునీల్, అమరేందర్ రెడ్డి, చెన్న శ్రీకాంత్, గణేష్, మేకల జితేందర, కైపెల్లి గంగన్న, సతీష్ ఉన్నారు.

సహకార సంఘం సమస్యలను పరిష్కరిస్తాం

నవతెలంగాణ-బెజ్జూర్

సహకార సంఘంలో జరిగిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చైర్మన్ ప్రకాష్ అన్నారు. గురువారం బెజ్జూర్ సహకార సంఘం పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2017-24 వరకు రైతుల వివరాలు నమోదు చేసిన ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు నమోదు సెప్టెంబర్ 20లోగా పూర్తిచేసి రైతులకు న్యాయం చేస్తామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు శ్రీవర్ధన్ తేలిబాపు, మేకల కోటేష్, భీమయ్య కమలాకర్ పాల్గొన్నారు.